## క్లుప్తంగా

### రైతు సమస్యల పరిష్కారానికి కృషి

ఏఎంసీ డైరెక్టర్ ముస్తఫా



ముస్తఫాను సన్మానిస్తున్న గ్రామస్తులు

యాలాల: రైతు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తాండూరు ఏఎంసీ డైరెక్టర్, కోకట్ నివాసి ముస్తఫా అన్నారు. ఏఎంసీ డైరెక్టర్‌గా నియమితులైన ముస్తాఫాను సోమవారం గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తమ గ్రామం నుంచి ముస్తఫాకు అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. సన్మానించిన వారిలో కోకట్ మాజీ సర్పంచ్ నాగేంద్రప్ప, గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, భరత సింహారెడ్డి, అశోక్‌గౌడ్, భరత్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

### వయోవృద్ధులకు సన్మానం



వృద్ధులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

పెద్దేముల్: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పెద్దేముల్ మండలం తట్టెపల్లి గ్రామంలో సోమవారం తొంబై సంవత్సరాలు దాటిన వృద్ధులను సన్మానించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, ఉప సర్పంచ్ కిష్టప్ప, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నారాయణగౌడ్, తట్టెపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజప్ప, డైరెక్టర్ హన్మంతు, మండల జూనియర్ అసిస్టెంట్ రమేష్, వార్డు సభ్యులు మైబు, శివరాం, లక్ష్మమ్మ ఉన్నారు.

### పార్టీకి కార్యకర్తలే కీలకం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. సోమవారం వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. పార్టీకి కార్యకర్తలు కీలకమని, అందరూ బీఆర్ఎస్ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు.

### మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం



ఉమాశంకర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

తాండూరు రూరల్: ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలని ముదిరాజ్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. చంద్రవంచ గ్రామానికి చెందిన పటేల్ ఉమాశంకర్ ముదిరాజ్.. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను సన్మానించారు. ఇందులో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రవి, నాయకులు రాము, బాలు, అమ్రేష్, హరి ప్రసాద్ ఉన్నారు.

### 'స్వచ్ఛత'లో కార్మికుల సేవలు ఎనలేనివి



కార్మికులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: పారిశుద్ధ్య పనుల్లో కార్మికుల సేవలు ఎనలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. స్వచ్ఛత హీ సేవ ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం కార్మికులను కమిషనర్ జీకార్ అహ్మద్‌తో కలిసి ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడారు. పది రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవలో కార్మికులు ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. పట్టణంలోని 34 వార్డులను నిత్యం శుభ్రంగా ఉంచటానికి కార్మికులు శ్రమించారని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం ప్రజల బాధ్యతని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కార్మికులు ర్యాలీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీదేవి, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తదితరులు



కొడంగల్‌లో.. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు



పెద్దేముల్: గాజీపూర్‌లో..

# మరపురాని మహోత్ములు

'జాతి మెచ్చిన ఇద్దరు మహానుభావుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి. వారి అడుగు జాడల్లో నడవాలి' అని పలువురు వక్తలు అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సకల జనులు వారి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత గాంధీజీదేనని, ఆయన బోధనలు మన మార్గాన్ని ప్రకాశింపజేస్తూనే ఉంటాయన్నారు. శాస్త్రీ.. దేశ స్వాతంత్ర్య సాధనలో కీలక భూమిక పోషించడమే కాకుండా.. ప్రధానిగా దేశానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. మరపురాని మహోత్ములు అని చెప్పారు.

– సాక్షి, నెట్‌వర్క్



ధారూరు: మండల పరిషత్ కార్యాలయంలో..



యాలాలలో.. ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, సర్పంచ్ సులోచన తదితరులు



అనంతగిరి: ఎంపీడీఓ కార్యాలయంలో



బంట్వారం: తొర్మామిడి జీపీ కార్యాలయంలో..



తాండూరు టౌన్: గాంధీ, శాస్త్రీ చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి తదితరులు



దౌల్తాబాద్‌లో..



కుల్కచర్ల: పీరంపల్లిలో..



కొడంగల్ రూరల్: పర్సాపూర్‌లో.. సర్పంచ్ సయ్యద్ అంజద్ తదితరులు



పరిగిలో.. మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ తదితరులు



పూడూరులో..



దోమలో.. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు

### నేడు మంత్రి పట్నం పర్యటన

కొడంగల్: మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మంగళవారం కొడంగల్ మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రుద్రారం గ్రామంలో నూతన సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన, చర్చీ నిర్మాణం, ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ, మైనార్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. పాటిమీది పల్లి నుంచి రుద్రారం వరకు బీటీరోడ్డు, జీపీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం నాగరం గ్రామం నుంచి రుద్రారం వరకు బీటీరోడ్డు, అన్నారంలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కోరారు.

### ఆర్థిక సహాయం

యాలాల: చెన్నారం గ్రామానికి చెందిన బ్యాగరి ఎల్లమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీవీజీ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నేత సంపత్‌కుమార్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో మాజీ సర్పంచ్ మల్లయ్య, మాదరప్ప, రాజు, మహేశ్ ఉన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

కొడంగల్ రూరల్: మండల పరిధి హస్నాబాద్‌లో దుర్గామాత ఉత్సవ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సర్పంచ్ పకీరప్ప, అధ్యక్షుడిగా డాక్టర్ కిషన్ జీ, ఉపాధ్యక్షుడిగా అంజప్ప, ప్రధాన కార్యదర్శిగా తిరుమలేశ్, ఉప కార్యదర్శిగా ఆనంద్, కోశాధికారిగా నర్సన్‌గౌడ్, ఉప కోశాధికారిగా అంజిలతో పాటు సాంస్కృతిక కార్యదర్శులు, భజన మండలి సభ్యులు, సలహాదారులను ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.

### ఘనంగా సంకష్టహర చతుర్థి వేడుకలు

షాద్‌నగర్: సంకష్టహర చతుర్థి వేడుకలను సోమవారం షాద్‌నగర్ పట్టణం గంజ్ ఆవరణ గణపతి దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఇందులో బీఆర్ఎస్ యువనేత మురళీకృష్ణ యాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ మహేశ్వరి, నాయకులు మహావీర్, క్యాసెట్ శ్రీను, గోపాల్ ఉన్నారు.

## 'అగ్నిపథ్'కు ఎంపిక అభినందనీయం



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

దోమ: దేశానికి సేవ చేయాలనే ఆలోచనతో యువత దేశ రక్షణలో భాగస్వాములు కావడం అభినందనీయమని ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. దోమ మండలం బొంపల్లి గ్రామానికి చెందిన బాసపల్లి వెంకటేశ్ ముదిరాజ్ అగ్నిపథ్‌లో ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సోమవారం సంఘం నేతలు వెంకటేశ్‌ను సన్మానించి మాట్లాడారు. వెంకటేశ్ చిన్నతనంలోనే తల్లితండ్రులను కోల్పోయినప్పటికీ పట్టుదలతో చదివి ఆర్మీ ఉద్యోగానికి సెలక్ట్ అవడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో సంఘం ప్రధానకార్యదర్శి యాదయ్య, నర్సింహులు, మంత్రి నర్సింహులు, బాబు, నరేందర్, శ్రీనివాస్, రాములు, బంటు నర్సింహులు, ఆంజనేయులు, నవీన్, భాస్కర్, రమేశ్ ఉన్నారు.

## మాటిస్తే తప్పని కాంగ్రెస్

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



పార్టీలో చేరిన వారితో మాజీమంత్రి ప్రసాద్ కుమార్

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పకుండా అమలు చేస్తుందని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్ మండలం బురంతపల్లి తండాలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడోలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఇందులో ఎంపీపీ చంద్రకళ, సీనియర్ నాయకులు కమల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మనోహర్, కిషన్ పాల్గొన్నారు.

**పార్టీలో పలువురు చేరిక**

వికారాబాద్ మున్సిపల్ పరిధి జన్నారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, కార్యకర్తలు నాయకులు పార్టీ అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



టోర్నీని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

- అప్పుడే భవిష్యత్ బంగారుమయం
- టోర్నీ ప్రారంభించిన ఎంపీపీ, జెడ్పీటీసీ

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో జిల్లా పరిధి గిరిజన సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు నిర్వహించిన టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు ఆటల్లో రాణించడం వలన భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సర్పంచ్ లక్ష్మి, వసతిగృహ అధికారులు రాజు, వెంకటయ్య, రాజేందర్, తులసిరాం, భీమయ్య, కృష్ణయ్య, శ్రీను పాల్గొన్నారు.

### కలిసికట్టుగా గ్రామాభివృద్ధి

మొయినాబాద్ రూరల్: కలిసికట్టుగా పనులు చేసుకుంటే సమస్యలే రావని, గ్రామాలు అభివృద్ధిలో పరుగులు తీస్తాయని కాశింబౌలి వాసులు అన్నారు. ఇటీవల ఇళ్ల ముందే మురుగు పరుగు శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పలువురు నాయకులు, ప్రజలు స్పందించి స్వచ్ఛందంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించుకున్నారు. దీనికి సంబంధించి ఉపసర్పంచ్ జయరాం రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దయాకర్‌రెడ్డి, వ్యవసాయ భూముల యజమానులు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ మేరకు పూర్తి చేసిన పనులను సోమవారం నాయకులు, గ్రామస్తులు ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లేశ్, సురేఖ, స్వప్న, జైపాల్‌రెడ్డి, అనూష, శ్రీకాంత్, శేఖర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మాడి ధనపాల్‌రెడ్డి, జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భిక్షపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల నిర్లక్ష్యంతో నిధులు తారుమారు

- శంకర్‌పల్లి మండలం ఫండ్స్ చేవెళ్ల మండలానికి..
- మిర్జాగూడ సర్పంచ్ రవీందర్‌గౌడ్ ఆరోపణ

శంకర్‌పల్లి: అధికారుల నిర్లక్ష్యం వలన తమ గ్రామ నిధులు మరో గ్రామానికి మళ్లాయని మిర్జాగూడ సర్పంచ్ రవీందర్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని మిర్జాగూడ గ్రామ నిధులు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఓటర్ ఐడీలు, ప్రభుత్వం సంక్షేమ పథకాల చెక్కులు చేవెళ్ల మండలం మిర్జాగూడ గ్రామానికి వెళ్తున్నాయని విమర్శించారు. మండలాల పేర్లు తెలియదా అంటూ ప్రశ్నించారు. ఇటీవల రూ.3.5లక్షల పనులు చేసి ఎంబీ రికార్డు చేయిస్తే పనులకు సంబంధించిన చెక్కును చేవెళ్ల మండలంలోని మిర్జాగూడ గ్రామానికి ఏ విధంగా పంపుతారని ధ్వజమెత్తారు. అధికారుల పనితీరు మార్చుకోవాలని, తమ గ్రామ చెక్కులు, పట్టాపాస్ పుస్తకాలు తమ గ్రామానికే వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు ప్రవీణ్, చిట్టమ్మ, సురేందర్‌రెడ్డి, రాజుగౌడ్, శివ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

చేవెళ్ల: తెలంగాణ ఏర్పాటులో ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాత కీలకమైనదని, ఆయన చరిత్రలో చిరస్మరణీయుడని చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి కొనియాడారు. మండల కేంద్రంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటుకు సోమవారం ఎంపీపీ రూ.లక్ష విరాళం సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయులు లింగచారి, శంబులింగం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి



సమ్మెలో మాట్లాడుతున్న వసంత

మోమిన్‌పేట: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వసంత డిమాండ్ చేశారు. సోమవారం నాటికి వారు చేస్తున్న సమ్మె 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఉద్యోగ విరమణ తర్వాత రూ.10 లక్షల బెనిఫిట్ ఇవ్వాలన్నారు. ఈ నెల 5న 'ఛలో వికారాబాద్'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు భారతి, రేణుక, అంగన్‌వాడీలు ఉన్నారు.

**సమస్యలు పరిష్కరించాలి..**

పరిగి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహానికి అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేని యెడలా సమ్మెను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశ వర్కర్లు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ చేయూత

షాద్‌నగర్: మండల పరిధి మొగిలిగిద్ద గ్రామం కస్తూర్బాగాంధీ పాఠశాలకు యూనియన్ బ్యాంక్ చేయూతనందించింది. సేవా కార్యక్రమాల్లో భాగంగా రూ.2లక్షల వ్యయంతో పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను సర్పంచ్ లలిత సోమవారం ప్రారంభించారు. పాఠశాలకు శానిటరీ డిస్పెన్సరీని బ్యాంక్ అందజేసింది. ఇందులో బ్యాంకు అధికారులు మనిమేకల, శ్రీధర్ బాబు, రఘునందన్, ఎంపీటీసీ జయలక్ష్మి, శ్రీశైలం, రాధాకృష్ణ, ఉప సర్పంచ్ లావణ్య ఉన్నారు.



టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ లలిత

## ప్రజాస్వామ్య దేశంలో దాడులు హేయం

- జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి
- రక్షణ చట్టాన్ని అమలు చేయండి
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర సభ్యుడు శ్రీకిషన్ రావ్



కొడంగల్: రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కొడంగల్: పాత్రికేయులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్. శ్రీకిషన్ రావ్ అన్నారు. ఐజేయూ పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని ఆరోపించారు. నిరంతరం ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్నామని, నిజాన్ని నిర్భయంగా రాస్తున్న విలేకరులపై కొన్ని శక్తులు దాడులకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో దాడులు చేయడం అప్రజాస్వామికమని అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జర్నలిస్టులకు రక్షణ చట్టం అమలు చేయడంతో పాటు మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే పాసులు పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరారు. అనంతరం స్థానిక తహసిల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. వడ్డర్‌గల్లీలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పృథ్వీరాజ్, కానుకుర్తి రమేష్, అరిగె అనంత ప్రసాద్, కత్తి ప్రభాకర్, రాకేష్, బొంకురు నరేష్, నరేందర్, గోపాల్, ఉమాపతి, సంజీవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఒక్క ఇంటి స్థలం ఇవ్వలేదు..**

కుల్కచర్ల: జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని టీయూడబ్ల్యూజే (ఐజేయు) సంఘం పరిగి నియోజకవర్గ అధ్యక్షుడు శివకుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం విలేకరులకు ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. జర్నలిస్టులకు రక్షణచట్టాన్ని అమలుచేయడంలేదని, మీడియా కమీషన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అందుకు అవసరమైన చర్యలు చేపట్టలేదన్నారు. అక్రిడిటేషన్ కలిగిన వారికి ఎటువంటి సధుపాయాలు కల్పించడం లేదని వాపోయారు. నేటి వరకు ఒక్క ఇంటి స్థలాన్ని ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు శ్రీనివాస్, పాండు, చందు, విజయ్, రమేష్, గణేశ్, నర్సింహులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.